రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# నిధులున్నా..పనులు సున్నా

## నిర్మాణానికి నోచుకోని భూగర్భ డ్రైనేజీ పనులు



రెడ్డి కాలనీలో తటాకాన్ని తలపిస్తున్న మురుగు

**నందిగామ, జూన్ 24, ప్రభాతవార్త :** వర్షాకాలం సమీపిస్తునందున రోగాలు ప్రబలే ఆస్కారం ఉన్నందున గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తం కావాలని ఒకపక్క అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్న నందిగామ మండలం సిడిత్నాడ గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు నిరక్ష్యం వీడడం లేదనీ సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. రెడ్డి కాలనీలో అండర్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిఎంఎఫ్టి ద్వారా రూ.20 లక్షలు, ఎస్డిఎఫ్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. గత మే నెల 20 వ తేదీన రెడ్డి కాలనీకి వచ్చి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. నేటికీ 40 రోజులు కావస్తున్నా అతిగతి లేదని కాలనీవాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మంచినీటి బోరు బావుల్లో సైతం మురుగునీరు వస్తుందని కాలనీకి చెందిన రాజా గౌడ్, విశ్వనాథ్, శ్రీకాంత్ లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సర్పంచ్ గబ్రు చౌహాన్‌ను వివరణ కోరగా పెద్ద పైపులు వెయ్యాలి కనుక ఆలస్యం అవుతుందని, కాంట్రాక్టర్లు అందుబాటులో లేకనే పనుల నిర్మాణంలో జాప్యం జరిగిందని, త్వరలోనే నిర్మాణ పనులు చేపడుతామని చెప్పారు.

# నొప్పించకుండా ఒప్పించండి

✦లక్ష్మీదేవీపల్లి భూసేకరణపై ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సూచన ✦ప్రాజెక్టు పూర్తి అయితే నాలుగు లక్షల ఎకరాలకు ప్రయోజనం ఉంటుందని వెల్లడి ✦ఇచ్చిన హామీని సిఎం కార్యరూపంలోకి తెచ్చారని హర్షం

**పరిగి, జూన్ 24, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా లోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు కె.పి.లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ప్రాజెక్టు పూర్తయితే దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పరిగి నియోజకవర్గం శాసనసభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు.. బుధవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**భూసేకరణ ఇలా..**
- షాద్‌నగర్ నియోజకవర్గం పద్మారం తదితర గ్రామాల్లో 278.35 ఎకరాలు
- పరిగి పరిధిలోని సైదుపల్లిలో 800 ఎకరాలు
- కుల్కచర్ల మండలం అల్లాపూర్‌లో 83.31 ఎకరాలు

ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన భూసేకరణ ప్రక్రియకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మిస్తే పరిగి, షాద్‌నగర్, వికారాబాద్, చేవెళ్ల, నియోజకవర్గాల్లోని సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, నిర్మాణానికి ప్రభుత్వం అధికారిక ఆమోదంతో తొలి అడుగు వేసిందని ఎమ్మెల్యే తెలిపారు.. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్లకు కె.పి. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారిక ఆదేశాలు జారీ చేశారని, అందుకు తగిన ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. బుధవారం చీఫ్ ఇంజినీర్లతో కలిసి రిజర్వా యర్ భూసేకరణ అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయి సమీక్ష నిర్వహించామని, భూసేకరణను త్వరగా ప్రారం భించేలా చర్యలు చేపట్టాలని పలు సూచనలు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే షాద్‌నగర్ నియో జకవర్గంలోని 60వేల ఎకరాలు, పరిగి నియోజకవర్గంలోని సుమారు ఎనభై వేలఎకరాలు, చేవెళ్ల, జడ్చర్ల, తాండూర్, వికారా బాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాలలో



ప్రాజెక్టు నిర్మాణ వివరాలను చెబుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రెండు లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించవ చ్చని అన్నారు. ఫిబ్రవరి 7న పరిగి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుపై మాట ఇచ్చారని, ఆ ప్రకారం అధికా రికంగా ఉత్తర్వులు జారీచేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. భూసేకరణ చేసి పదివేలకోట్ల రూపాయలతో ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు.

**ప్రాజెక్టు స్థలంలో తొలి అడుగు**

అనంతరం ఎమ్మెల్యేలు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి.. అధికారులతో చర్చించారు. భూసేకరణ, సర్వే ప్రక్రియ, నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, వారిని ఒప్పించి భూసేకరణ చేపట్టాలని ఎమ్మెల్యేలు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులు, ఏడి సర్వేయర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ప్రాజెక్టు సామర్థ్యం:** 2.8 టిఎంసిలు
**నిర్మాణ ఖర్చు :**10 వేల కోట్లు
**ప్రయోజనం పొందే ఆయకట్టు:** షాద్‌నగర్‌లో 60వేల ఎకరాలు, పరిగిలో 80వేల ఎకరాలు, చేవెళ్ల, జడ్చర్ల, తాండూర్, వికారాబాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ పరిధిలో 2 లక్షల ఎకరాలు



ప్రాజెక్టు స్థల పరిశీలన అనంతరం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

# రెచ్చగొట్టే వారితో జాగ్రత

✦బిఆర్ఎస్ ప్రచారాలు నమ్మకండి ✦నిర్వాసితులకు అండగా ఉంటాం
✦నీరు పారే వరకు నిద్రపోం ✦భూ సేకరణకు సహకరించండి: ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జూన్ 24, ప్రభాతవార్త :** పాజెక్టు పనులు ముందుకు సాగుతుండటాన్ని చూసి కొందరు బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. రైతులు అలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. భూ నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతాంగం భూ సేకరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం రూ.587 కోట్ల నిధులను కేటాయించి విడుదల చేసిన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, పునరావాసం, పునర్నిర్మాణ శాఖ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఇరిగేషన్ ఈఈ దయానంద్, సర్వే అధికారులు, షాద్‌నగర్ ఆర్డీఓ ఎన్.ఆర్. సరిత తదితర అధికారులు బుధవారం స్థల పరిశీలన నిర్వహించారు. స్థానిక రైతాంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు తొలిసారిగా ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించడంతో రైతులు వారికి ఘన స్వాగతం పలికారు. రిజర్వాయర్ నిర్మాణానికి మొత్తం 1,510 ఎకరాల భూమి అవసరమవుతుందని అధికారులు తెలిపారు. కాలువలు, ఇతర అనుబంధ నిర్మాణాల కోసం అదనపు భూమి కూడా అవసరం అవుతుందని పేర్కొన్నారు.

**కొంతమంది త్యాగంతో వేలాది మందికి ప్రయోజనం**

ఈ భూ సేకరణలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని పద్మారం తదితర గ్రామాల్లో 278.35 ఎకరాల భూమిని వినియోగించనున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని సైదు పల్లి గ్రామంలో 800 ఎకరాలకు పైగా, కుల్కచర్ల మండలంలోని అల్లాపూర్ ప్రాంతంలో 83.31 ఎకరాలు అవసరమవుతాయని వెల్లడించారు. మొత్తం ప్రాజెక్టు కెపాసిటీ 2.8 టిఎంసిలు కాగా మొత్తం ప్రాజెక్టుకు 10 వేల కోట్ల రూపాయలు వ్యయం అవుతున్నట్లు అంచనా ఉందని తెలియజేశారు. కొంతమంది రైతుల త్యాగాల వల్ల వేలాది మంది రైతాంగానికి ప్రయోజనం చేకూరుతుందని, సహ కరించే ప్రతి రైతుకు ప్రభుత్వం పూర్తి పరిహారం అందజేస్తుందని అధికారులు హామీ ఇచ్చారు. త్వరలోనే భూ సర్వే పూర్తి చేసి తదుపరి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు.

**రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వ పెద్దలతో కొట్లాడాం**

ఈ సందర్భంగా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేయనున్న స్థలంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తమ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రిని సైతం ఇబ్బంది పెట్టాం.. మంత్రులను కూడా వదల్లేదు.. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సరే అనుకున్నది సాధించాం.. ఇక షాద్‌నగర్, పరిగి నియోజకవర్గాల్లో నీరు పారే వరకు నిద్రపోం అని ఉద్ఘాటించారు.

**కెసిఆర్ మాట తప్పారు**

కరివేన-ఉద్దండాపూర్ ద్వారా 6వ లిఫ్ట్ పరిధిలో చేపట్టనున్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. కుర్చీ వేసుకుని లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టును నిర్మిస్తానని చెప్పి అమలు చేయలేదన్నారు. ఉత్తర తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇచ్చి, ఈ ప్రాంత ప్రయోజనాలను విస్మరించారని ఆరోపించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజె క్టును రద్దు చేసి కాళేశ్వరం వైపు నిధులు మళ్లిం చడం వల్ల ఈ ప్రాంతానికి నష్టం జరిగిందన్నారు. లక్ష్మీదేవిపల్లి పేరుతో ప్రాజెక్టు ప్రకటించినప్పటికీ, లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన భూమి ఒక్క ఎకరం కూడా ముంపులోకి రాకపోవడం అప్పటి ప్రభుత్వ నిరక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లేడు చౌదరిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, పద్మారం వెంకటేష్, లక్ష్మీ కాంత్ రెడ్డి, రఘునాయక్, తిరుపతి రెడ్డి, శ్రీను నాయక్, బాదేపల్లి సిద్ధార్థ్, బాలరాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, సుదర్శన్ గౌడ్, కరుణాకర్, అశోక్, పిట్టల రజితతో పాటు ఆయా గ్రామాల రైతులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌కు ఇంకో బస్ సర్వీస్ ఇవ్వండి

### మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పొన్నాల్ కౌన్సిలర్లు వినతి

**శామీర్‌పేట, జూన్ 24, ప్రభాతవార్త :** పొన్నాల్ నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో సకాలంలో ఆర్టీసి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఉదయం, సాయంత్రం సమయాల్లో మరో కొత్త ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పిం చాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పొన్నాల్ కౌన్సిలర్లు కొలాసు రాజు, మ్యాడబోయిన మౌనిక శివవీరప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి, పలువురు నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పొన్నాల్ నుంచి ఆ ఇద్దరు కౌన్సిలర్లు, జిల్లా మహిళా అధ్యక్షురాలు, పలువురు నాయకులు కలిసి నగరంలోని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంకు వెళ్లి పొన్నాల్ గ్రామానికి మరో ఆర్టీసి బస్సు సౌకర్యం ఉదయం,సాయంత్రం వేళల్లో కల్పించాలని కోరారు. పొన్నాల్ గ్రామం నుంచి ఉదయం 7.30గంటలకు, తిరిగి మధ్యాహ్నం, సాయంత్రం మూడు ట్రిప్పులు పొన్నాల్ నుంచి సికింద్రాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, ఆర్టీసి బస్సు సమస్యలను పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. అనంతరం హకీంపేట్ ఆర్టీసి డిపో అసిస్టెంట్ మేనేజంకు కూడా వినతిపత్రాన్ని అందించారు.



# సర్కారు బడిలో స్విమ్మింగ్ పూల్

విద్యార్థుల కోసం రూ.1.85 కోట్లతో నిర్మాణం



స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కమిషనర్ బలరాంనాయక్

**కొడంగల్, జూన్ 24 ప్రభాతవార్త :** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో ప్రభుత్వం స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించింది. రూ.1.85 కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి బుధవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందులో భాగంగానే అభివృద్ధి పనులకు పుష్కలంగా నిధులు మంజూరు చేస్తుండడంతో పనులు ఊపందుకున్నాయన్నారు. ఓ పక్క మురుగు కాల్వల నిర్మాణ పనులు, మరోపక్క అండర్ డ్రైనేజీ పనులు, ప్రతి గ్రామానికి రోడ్ల సౌకర్యం, ప్రధాన రహదారిపై డివైడర్ ఏర్పాటుతో పాటు విద్యుత్ దీపాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని వివరించారు. చిన్నారుల ఆహ్లాదం కోసం స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో 220 పడకల ఆసుపత్రి నిర్మాణమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, వైస్‌చైర్మన్ శంకర్‌నాయక్, మున్సిపల్ కౌన్సిలర్‌లు బత్తుల అనితనర్సింహ, హమీద్, మునీర్, పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, అనంద్‌రెడ్డి, ఆసీఫ్‌ఖాన్, పర్సాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రూ.86 కోట్ల నష్ట పరిహారం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివెటెడ్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి భూములు, స్థలాలు ఇచ్చిన తూంకుంట రైతులకు పరిహారంగ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి చెక్కులను అందజేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో తూంకుంటలో రోడ్డు వెడల్పు కోసం మూడవ విడతగా స్థలాలను ఇచ్చిన వారికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి పరిహారంగ చెక్కులను పంపిణీ చేశారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంట గ్రామంలో 24 ఎకరాలకు గాను స్థలాలను ఇచ్చిన రైతులకు మూడవ విడతగా డిఆర్ఓ మాలతితో కలిసి కలెక్టర్ మనుచౌదరి 86కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ మిగిలిన వారికి కూడా త్వరలోనే చెక్కులు అందించనున్నట్లు వివరించారు.



రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్

### ఓటరు వివరాల నమోదులో

## తప్పడు సమాచారం ఇవ్వకండి

**చేవెళ్ల, జూన్ 24, ప్రభాతవార్త :** 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారంను అందించాలని, బిఎల్‌ఓలుగా ఒంటింటికి తిరిగి సక్రమంగా పనిచేయకుంటే చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి హెచ్చరించారు. బుధవారం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంపై చేవెళ్ల ఆర్డీఓ పార్థసారధి, చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణా, మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌ను పారదర్శకంగా నిబంధనల ప్రకారం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి, ఓటరు తమ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఫారాల్లో తప్పడు సమాచారం నమోదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుం టామన్నారు. జిల్లాలోని చేవెళ్ల డివిజన్‌లోనే ఓటర్ల వివరాలల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

**చేవెళ్లకు జిల్లాలో ఫస్ట్ ప్లేస్**

చేవెళ్ల డివిజన్ పరిధిలోని మండలాలు జిల్లాలోని మండలాలతో పోల్చితే మొదటి స్థానంలో ఉందన్నారు. మ్యాపింగ్ పూర్తయిన వారికే కాకుండా మిగిలిన ప్రతి అర్హత గల ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలన్నారు. ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటు తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని, సమర్పించని వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించడం జరుగుతుందన్నారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, ప్రజలు వారికి సహకారించాలన్నారు. బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లకుండా సక్రమంగా పనిచేయకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఓటరు ధృవీకరణకు అవసరమైన పత్రాలను సమర్పించడం ద్వారా మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.
అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చనిపోయిన వారిని ఓటరు లిస్ట్‌లో నుండి తొలగించడం జరుగుతుందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం ఉందన్నారు.
2002 ఓటరు లిస్ట్‌ను ప్రస్తుత ఓటరు లిస్ట్‌లను మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. మ్యాపింగ్‌లో లేని ఓటరు ఫాం ఎన్‌రోల్‌మెంట్‌తో నమోదు చేసుకోవాలన్నారు. మ్యాపింగ్ ద్వారా శుద్ధమైన ఓటరు జాబితా తయారు చేసేందుకు ఎన్నికల సంఘం ప్రక్రియ ప్రారంభించిందన్నారు.

# ఇచ్చింది సగమేనా!

### విద్యా రుణాలు రూ.801.41కోట్ల లక్ష్యానికి రూ.430.07కోట్లు మంజూరు

### బ్యాంకర్ల తీరుపై అదనపు కలెక్టర్ అసంతృప్తి

### డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశాలకు రాని వారిపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 24, ప్రభాతవార్త :** బ్యాంకర్లు అందరు డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశాలకు ఖచ్చితంగా హాజరు కావాలని, గైర్హాజరు అయిన వారిపై చర్యలకు బ్యాంకర్ల చైర్మన్లకు, పై అధికారులకు లేఖలు పంపుతామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ స్పష్టం చేశారు. బ్యాంకర్ల హాజరు విషయంపై తీవ్రంగా పరిగణిస్తామని ఆయన అన్నారు. ఈసారి 2026-2027 సంవత్సరానికి రూ.95,163కోట్లతో కొత్త వార్షిక ప్రణాళిక కేటాయించినట్లు చెప్పారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో పాటు ఆర్‌బిఐ ఎజిఎంఅండ్ ఎల్‌డిఎం హేమలత, నాబార్డు డిడిఎం ఝాన్సీ రాణి, లీడ్‌బ్యాంకు (కెనెరాబ్యాంకు) జిల్లా కంట్రోలర్ ఎజిఎం అనురాగ్ ప్రకాశ్, వివిధ బ్యాంకుల జిల్లా కంట్రోలర్లు, డిఐసి వ్యవసాయం, డివిఎహెచ్ఓ ఉద్యానవన, పట్టుపరిశ్రమ, డిసిఓ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్స్, మైనార్టీ సంక్షేమం, ఉపాధి కల్పన శాఖల అధికారులు ఎఫ్ఎల్‌సి, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు 2025- 26సంవత్సరానికి గాను రూ.82,487కోట్ల వార్షిక రుణ లక్ష్యం నిర్దేశించగ, రూ.1,86,975కోట్లు (226.67శాతం) సాధించినట్లు తెలిపారు. నాబార్డు వారి పొటెన్షియల్ క్రిడిట్ లింక్ ప్లాన్ (రుణ సామర్థ్య ప్రణాళిక) ప్రకారం 2026- 27సంవత్సరానికి ప్రాధాన్యత రంగం కోసం రూ.33,290కోట్లు కేటాయించారు. ఇందులో వ్యవసాయానికి రూ.3,056కోట్లు, ఎంఎస్ఎంఇ రంగానికి రూ.27,882కోట్లు, విద్యకు రూ.325కోట్లు, గృహని ర్మాణంకు రూ.1,410కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ.2,292కోట్లు ఉన్నట్లు తెలిపారు.
2025-26కు ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగంలో రూ.2,996.65కోట్ల లక్ష్యానికి గాను రూ.6,173.60కోట్లు, ఎంఎస్ఎంఇ రంగంలో రూ.23,042కోట్ల లక్ష్యానికి గాను రూ.23, 490 కోట్లు సాధించినందుకు బ్యాంకర్లును, ఎల్‌డిఎంను అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ అభినందించారు.
అయితే విద్యా రుణాల విషయంలో రూ.801.41కోట్ల లక్ష్యానికి గాను కేవలం రూ.430.07కోట్లు మాత్రమే సాధించినందున ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాల లక్ష్యాలను మరింత సమర్థవంతంగ సాధించాలని సూచించారు. గృహరుణాల విషయంలో రూ.15,593కోట్ల లక్ష్యానికి గాను రూ.16,248.48కోట్లు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకర్లు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డిసిసి,డిఎల్ఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## ధాన్యం కొనుగోళ్లలో దగా చేస్తున్నారు

### 341 సంచులు తరలిస్తే 271కి మాత్రమే బిల్లు

### మైల్వార్ రైతులు మండిపాటు

**బషీరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :** పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని మైల్వార్ గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి అదే గ్రామానికి చెందిన రైతు మున్నూర్ శమప్ప గత నెల 18న 172 , 19న 169 సంచులు చొప్పున తరలించినట్లు చెప్పారు. మొత్తం 341 సంచులకు ఒక్కోసంచికి 42.900 కిలోగ్రాముల చొప్పున తూకం నిర్వహించారని.. అందులో 70సంచులను తొలగించి కేవలం 271 సంచులకు మాత్రమే బిల్లులు చేస్తున్నారని రైతు శమప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణం చూపకుండా 70 సంచులకు బిల్లులు చేయకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంపై నమ్మకంతో పంటను విక్రయిస్తే నష్టాలుపాలు అవుతున్నామని మండిపడ్డారు. దీనిపై సంబంధిత అధికారులు పూర్తి విచారణ జరిపి మిగిలిన వాటికి బిల్లులు చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## 27 పంచాయతీ భవనాలకు రూ.5.40 కోట్లు

### ఒక్కో గ్రామానికి రూ.20 లక్షలు కేటాయింపు

**షాద్‌నగర్, జూన్ 24, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 27 కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పరిపాలన అనుమతి మంజూరు చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ సమర్పించిన నివేదిక, అంచనా వ్యయాల ఆధారంగా మొత్తం రూ.5.40 కోట్ల వ్యయంతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఈ నిర్మాణాలు చేపట్టేందుకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు దశలవారీగా పనులు చేపట్టనున్నారు. మొదటి విడతలో చౌదర్‌గూడ మండలంలోని చౌదర్‌గూడ, పెద్దాపూర్ గ్రామాలు, ఫరూఖ్‌నగర్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామాల్లో తలా రూ.20 లక్షల చొప్పున అంచనా వ్యయాన్ని ఆమోదించారు. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు అందుబాటులోకి రావడంతో పాటు గ్రామీణ పరిపాలన మరింత బలోపేతం కానుందని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలన అంశాలను గాలికి వదిలేసారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామపంచాయతీల మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిందని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు.



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్**

**కుల్కచర్ల, జూన్ 24, ప్రభాతవార్త:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అసుపత్రిలో రికార్డులు పరిశీలించి వార్డులను ,పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ...అసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.వైద్యలు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు.మండల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్,సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ,ఎస్ఐ

**కుల్కచర్ల, జూన్ 24, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల నివారణకు తగుచర్యలు తీసుకోవాలని సిఐ కొండల్‌రెడ్డి అన్నారు.మండల పరిధిలోని ఘణపూర్ గేట్ సమిపంలో రోడ్డు ప్రమాదం జరిగిన స్థలానికి స్థానిక ఎస్ఐ రమేష్ కుమార్,ఆర్ అండ్ బి ఏఈ మహేష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం స్పీడ్ బేకర్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఏఈ మహేష్‌కు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## సామాన్యులపై పెంచిన భారాన్ని తగ్గించండి

**-- ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించిన బిజెపి నేతలు**

**తాండూరు, జూన్ 24, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అశాస్త్రీయంగా పెంచిన మార్కెట్ రేటును తగ్గించాలని తాండూరు పట్టణ బిజెపి నేతలు డిమాండ్ చేశారు. గత 15రోజుల క్రితం నుండి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గజం మార్కెట్ విలువను సుమారు 100శాతం నుండి 180శాతం వరకు పెంచడం జరిగిందని, పెంచిన చార్జీలతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతుందని, ఇష్టానుసారంగా పెంచిన మార్కెట్ చార్జీలను తగ్గించేలా చూడాలని, ఇందుకు కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బిజెపి పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్ అంతారం కిరణ్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, మంతటి రాజు తదితరులు బుధవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

## అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శ్రీకారం

**నందిగామ, జూన్ 24, ప్రభాతవార్త :** నందిగామ మండలం సిడిత్నాడ గ్రామపంచాయతీ పరిధిలోని తాటిగడ్డ తండాలో హెచ్ఎండిఏ నిధులు రూ.10 లక్షలతో సర్పంచ్ గబ్రు చౌహాన్ బుధవారం అండర్ డ్రైనేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గబ్రు చౌహాన్ మాట్లాడుతూ కలిసి పని చేద్దాం.. ప్రగతికి బాటలు వేద్దాం అన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్షాకాలం సమీపిస్తున్నందున విష జ్వరాల బారిన పడకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్,



భూమి పూజ చేసిన సర్పంచ్ గబ్రు చౌహాన్

ఉప సర్పంచ్ ముడావత్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు జటావత్ రాజేష్, జటావత్ మాధవి లక్ష్మణ్ నాయక్, బుజ్జి శంకర్ నాయక్, పాత్లావత్ శ్రీను, శాంతి శ్రీను, మెగావత్ నాగేష్, పత్తి శీను , పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, నాయకులు ఆనంద్ నాయక్ , జాంబ, భగత్ సింగ్, చందర్, సింగిల్ విండో డైరెక్టర్ రూప్ సింగ్ , విజయ్ నాయక్, రెడ్యా, పరుశురాం, కాంట్రాక్టర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులపై శిక్షణ తరగతులు ప్రారంభం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 24, ప్రభాత వార్త:** వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు బహుళ విభాగాల సమన్వయం కీలక పాత్ర పోషిస్తాయని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ వి. విజయ్‌కుమార్ అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో వాతావరణ మార్పులు, జలవనరులు, నేలఆరోగ్యం, పర్యావరణ సుస్థిరతపై వారం రోజుల పాటు నిర్వహించే అధ్యాపకుల శిక్షణ కార్య



అనురాగ్ యూనివర్శిటీలో వాతావరణ మార్పులపై వారం రోజుల పాటు నిర్వహించే అధ్యాపకుల శిక్షణ తరగతులకు హాజరైన అధ్యాపకులు, పరిశోధకులు.

క్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జల వనరులు, వ్యవసాయ భూముల ఉత్పాదకత, నేల నాణ్యత పర్యావరణ సమతుల్యతపై ఏర్పడుతున్న ప్రభావాల గురించి ఈ శిక్షణ తరగతుల్లో అధ్యాయనం చేయనున్నట్లు తెలిపారు. ప్రకృతి వనరుల సంరక్షణ, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై నిపుణుల అనుభవాలను పరిశోధన ఫలితాలనను చర్చించనున్నట్లు తెలిపారు. సుస్థిర ఇంజినీరింగ్ విధానాలను ప్రోత్సహిస్తూ అధ్యాపకులు, పరిశోధకుల సామర్థ్యాభివృద్ధికి అనురాగ్ యూనివర్శిటీ నిరంతరం కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. వారం రోజుల పాటు జరుగనున్న అధ్యాపకుల శిక్షణ తరగతులను ఇంజినీరింగ్ విభాగధిపతి పల్లవి బాద్రి నాయకత్వంలో, కన్వీనర్లుగా గుమ్మడి వెంకటరావు, మధుసూదన్‌రెడ్డిలు వ్యవహారించారు.

## నేడు యాచారంలో జాన్ వెస్లీ పర్యటన

**యాచారం, జూన్24 ,ప్రభాతవార్త:** నేడు యాచారం మండల ప్రభుత్వ ఆసుపత్రిని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పరిశీలించినునట్లు పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ తెలిపారు. ఓ ప్రకటన తెలుపుతూ యాచారం మండల ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెరిగిన వసతులు కరువైనట్టు హాస్పిటల్లో పరిస్థి తులు తదితర విషయాలు తెలుసుకోవడం కొరకు రాష్ట్ర నాయకులు విచ్చేస్తున్నట్లు తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాప్ దగ్ధం

**నందిగామ, జూన్ 24, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో కరెంటు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన సంపత్ టైలర్ షాపును బుధవారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. తక్షణ సహాయం కింద రూ.50 వేలు అందజేశారు. టైలర్ షాప్ తో స్వయం ఉపాధి పొందుతున్న సంపత్ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. మానవతామూర్తులు, దాతలు స్పందించి అగ్ని ప్రమాదంలో నష్టపోయిన సంపత్ కుటుంబానికి బాసటగా నిలవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



టైలర్ షాప్‌లో దగ్ధమైన మిషనరీ

ఎమ్మెల్యేగారి స్ఫూర్తితో నందిగామ 6వ వార్డు సభ్యుడు శివగళ్ల ప్రవీణ్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.యువ నాయకుడు శివ గల ప్రవీణ్ సేవాస్ఫూర్తిని గ్రామస్తులు అభినందించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, సిడి తండ మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, ఎస్పై దేవరాజ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల సురేష్, టైలర్ కృష్ణ,బొమ్మగళ్ళ నర్సింలు,కిట్టు, నాయకులు పిట్టల రాములు, బి కృష్ణ యాదవ్, యువ సత్తా లక్ష్మణ్ కుమార్ ఉన్నారు.

# రెండు చుక్కలు - జీవితకాల రక్ష

**కొత్తూర్, జూన్ 24, ప్రభాతవార్త:** పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బుధవారం కొత్తూర్ మండల కేంద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అరుంధతి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీప్తి తెలిపారు. ఈ సమావేశంలో 100 శాతం పోలియో కవరేజీ సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 28వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 40 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో చుక్కలు పూర్తిగా ఉచితం, సురక్షి తమైనవని, జబ్బుగా ఉన్న పిల్లలకు, కొత్తగా పుట్టిన శిశువులకు కూడా వేయవచ్చని వివరించారు. బూత్‌లకు రాలేని కుటుంబాల కోసం జూన్ 29, 30 మరియు జూలై 1 తేదీల్లో ప్రత్యేక ఆరోగ్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పోలియో బూత్‌లు అన్ని వార్డులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్ స్టాండ్, జాతీయ రహదారి44 పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ దీప్తి

చేయనున్నట్లు వెల్లడించారు. భారత్ ఇప్పటికే పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందిందని, అదే స్ఫూర్తితో కొత్తూర్‌ను కూడా పోలియో రహితంగా కొనసాగించేందుకు ప్రతి కుటుంబం సహకరించాలని డాక్టర్ దీప్తి కోరారు.

# ప్రతి గ్రామానికి ఓ పోలీస్ అధికారి

**- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు ఇన్స్పెక్టర్ నర్సయ్య**

**కొత్తూరు, జూన్ 24, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపల్ మరియు మండలంలోని గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడానికి ప్రతి గ్రామానికి ప్రత్యేక పోలీసు అధికారిని నియమించినట్లు కొత్తూరు సిఐ నర్సయ్య బుధవారం మీడియాకు తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో చట్ట వ్యతిరేక, రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, ఫొటోలు షేర్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టడం, షేర్ చేయడం నేరమని తెలిపారు. గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు షేర్ అయితే అడ్మిన్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి గ్రామానికి ప్రత్యేక పోలీసు అధికారులను నియమించినట్లు ఇన్స్పెక్టర్ నర్సయ్య తెలిపారు.



గ్రామాల వారిగా నియమించిన పోలీస్ అధికారులు హెడ్ కానిస్టేబుల్ గోపాల్ - సిద్దాపూర్, చింతగట్టు తాండ - 9949731783, హరీష్ కుమార్ - పులిచెర్లకుంట తాండ - 9550283662, కే. హజియా - ఏనుగుమడుగు తాండ - 9618231924, వై. శివరంజన్ - శేరిగూడ, భద్రాయపల్లి - 9398165423, ఏ. కుమార్ - కొడిచెర్ల - 8712511057, హెడ్ కానిస్టేబుల్ వి. సురేష్ - కొడిచెర్ల తాండ - 9866067758, పి. రవికుమార్ - పెంజర్ల - 8712510659, రవికుమార్ - ఇములనర్వ - 9908786490, కొత్తూరు టౌన్ జి. శ్రీనివాస్ - 8712510795, కే. సాయిరాం - 8712512931, ఎన్. వెంకటేశ్వరమ్మ - 8712512838, ఎం. యాదయ్య - తిమ్మాపూర్ - 9704358161, శ్రీరంజన్ - స్టేషన్ తిమ్మాపూర్ - 9010340526, డి. మైపాల్ - తీగాపూర్ - 8712510620, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రెడ్డి - మల్లాపూర్ - 8712510775, జగదీష్ - మల్లాపూర్ తాండ, లోక్య తాండ, గుడి తాండ - 8712510227, సాయి చరణ్ - గూడూరు - 8712510814, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ - మక్తగూడ, పెద్దగుట్ట తాండ - 9618012365 .

# దౌల్తాబాద్ మండలంలో విస్తృతంగా అభివృద్ధి పనులు

**-నూతన అంగన్వాడీ భవనాలు,తరగతి గదులను ప్రారంభించిన తిరుపతిరెడ్డి**

**దౌల్తాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి.ఇందులో భాగంగా మండల కేంద్రంతో పాటు దేశాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను,అలాగే మండల కేంద్రంలోని పాఠశాలలో అదనపు తరగతి గదులను కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ప్రారంభించారు.ఈ కార్య క్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన ఈ నూతన సౌకర్యాలు ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదు పాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో కాడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి,మండల అధికారులు, దౌల్తాబాద్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి,దేశాయిపల్లి సర్పంచ్ సాయప్ప,మండల నాయకులు వెంకట్‌రావు, వెంకట రెడ్డి,వీరన్న,రాజశేఖర్ రెడ్డి,మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, వెంకట్ రాములు,కొటం రాములు,దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తిరుపతి రెడ్డి,సర్పంచ్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ ,కార్యదర్శి,తదితరులు

## లేమామిడిలో సిసి రోడ్డు పనులకు భూమి పూజ

**కేశంపేట ,జూన్ 24 ,ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ సహకారంతో సిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం లేమామిడి గ్రామ సర్పంచ్ సులోచన శీను ప్రారంభిం చారు. రూ.5 లక్షల డిఎం ఎఫ్‌టి నిధులతో గ్రామ ప్రాథ మిక పాఠశాల నుంచి స్మశాన వాటిక వరకు సిసి రోడ్డు నిర్మించనున్నారు. రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దిద్దెల రఘుపతి, ప్రకాష్ గౌడ్, బాలాజీ, కావాలి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, చాకలి వెంకటయ్య, బాల కిష్టయ్య, రాజశేఖర్, పురుషోత్తం, తాహెర్, వజిత్, నిర్మల్, యాదయ్య గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదయ్య, కరోబార్ బైండ్ల యాదయ్య, మాల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా సీనియర్ సిటిజన్స్ గ్రామ కమిటి ఎంపిక

**కేశంపేట, జూన్ 24, ప్రభాతవార్త :** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ నూతన కమిటీని బుధవారం కేశంపేట మండలం పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా కందాడ లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా సొన్నాయిల బాలయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా పల్లాటి సుధాకర్, కోశాధికారిగా బండపల్లి జంగయ్య ముదిరాజ్, నిదిగా బ్యాగరి రామస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కందాడ లక్ష్మయ్య మాట్లాడుతూ గ్రామంలో సభ్యత్వ నమోదులు జరుగుతున్నాయని తెలంగాణ సీనియర్ సిటిజస్ అసోసియేషన్లో చేరదరుచుకున్నవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు . ఈ కార్యక్రమానికి గ్రామసర్పంచ్ శశికళ యాదయ్య, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,పల్లాటి లక్ష్మినారాయణ. తాండ్ర రమేశ్ రెడ్డి మరియు గ్రామస్తులు సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

## యువతకు డ్రగ్స్ ముప్పుపై అవగాహన

**ఎస్ఐ రాఘవేందర్ ఆధ్వర్యంలో 2కె రన్**

**ధారూర్, జూన్ 24, ప్రభాత వార్త:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ధారూర్ మండల కేంద్రంలో అవగాహన

ధారూర్ లో 2కె రన్



కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ సున్నం రాఘవేందర్ ఆధ్వర్యంలో ఖ2కె రన్‌ఖ నిర్వహించి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపారు.ఈ సందర్భంగా ఎస్ఐ రాఘవేందర్ మాట్లాడుతూ, నేటి యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, జీవితంపై పడే ప్రభావాల గురించి వివరించారు. చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొని, డ్రగ్స్ రహిత సమాజం కోసం తమ మద్దతును తెలిపారు.

## రిలే నిరాహార దీక్ష




రావల్‌కోల్ గ్రామంలో నిరాహారదీక్ష చేపడుతున్న రైతులు, గ్రామస్తులు

**మేడ్చల్, జూన్ 24,ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో ఏర్పాటు చేస్తున్న క్రషన్ మిషన్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, రైతులు నిలే నిరాహారదీక్ష చేపట్టారు.గ్రామ శివారులోని సర్వే 111 లో నూతన క్రషర్ మిషన్ ఏర్పాటుకు సన్నహాలు చేపట్టడంతో గ్రామ ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ అనుమతులు రద్దు చేయాలని గత 40 రోజుల నుంచి రైతులు కార్యాలయాలు చుట్టూ తిరిగి వినతి పత్రాలు అందజేశారు. అంతే కాకుండా సమస్య పై అధికారులకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు కూడా చేశారు. అధికారులు స్పందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు నిరే నిరాహార దీక్షకు దిగారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రషర్ మిషన్ ఏర్పాటు వల్ల పంట పొలాలు నాశనం అవుతాయని, గ్రామానికి చేరువలో ఉండటంతో శబ్ద, వాయు కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామ ప్రజలు వ్యతిరేకించినా అధికారులు అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రషర్ మిషన్ అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు ఎక్కల్ దేవి శ్రీశైలం యాదవ్, నాయకులు మామిండ్ల వెంకటేష్, పిట్ల సాయిలు, పిట్ల శ్రీధర్, వై బిక్షపతి , బంటు మల్లేష్, బంటు నర్సింగరావు, వై పెంటయ్య, వై నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణం అనుకూలించక విమానాల దారి మళ్లింపు

**శంషాబాద్ జూన్ 24,ప్రభాతవార్త :** నాగ్‌పూర్ విమానాశ్రయంలో వాతావారణం అనుకూలించగా పలు విమానాలు దారి మళ్లించారు.నాగ్‌పూర్ వెళ్లాల్సిన పలు విమానాలను శంషాబాద్‌కు దారి మళ్లింపునాగ్‌పూర్‌లో వాతావరణం అనుకూలించక పలు విమానాలను శంషాబాద్‌కు దారి మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, ముంబయి నుంచి నాగ్‌పూర్ వెళ్లాల్సిన విమానాలు దారి మళ్లించారు.

## తాండూరు యువకుడికి గిన్నిస్ రికార్డు

**-- అభినందించిన వీరశైవ సమాజం ప్రతినిధులు**

**తాండూరు, జూన్ 24, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీభావిగి భద్రేశ్వర దేవాలయ పూజారి, వీరశైవ సమాజం సభ్యులు మడపతి విజయ్‌కుమార్ స్వామి కుమారుడు వినయ్‌కుమార్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. ఈ నెల 13న భారతతేశంలోని జమ్మూ కాశ్మీర్ విభాగంలో లదాక్ సరిహద్దుల్లో వుమ్లింగ్‌లా అనే ఎత్తయిన శిఖరం(ఎత్తు 19024 ఫీట్లు) మైనస్ డిగ్రీ ఆక్సిజన్‌లో ఎంతో కఠినాత్మకమైన శిఖరాన్ని అవరోధించి.. గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. దీంతో బుధవారం వీరశైవ సమాజం సభ్యులు వినయ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ

**కుల్కచర్ల, జూన్ 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయని సర్పంచ్ రవిందర్ నాయక్ అన్నారు. బుధవారం మండల పరధిలోని చెరువుముందలి తాండ(ఎ) గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి లలిత,ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**యాచారం, జూన్24, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలంగాణ జన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామ నిరంజన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. నర్సరీ, ఎల్‌కేజీలకే రూ.30 వేల నుండి లక్షన్నర వరకు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ కూలీ పనులు చేసుకునే పేదలు పస్తులుండి మరీ ఫీజులు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు ఇవ్వాల్సిన 25 శాతం ఉచిత సీట్లను యాజమాన్యాలు తుంగలో తొక్కాయన్నారు. హైకోర్టు ఆదేశాలను ఆసరాగా చేసుకుని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫామ్‌లను మూడింతలు ఎక్కువ ధరలకు అమ్ముకుంటూ వ్యాపారంగా మార్చారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇబ్రహీంపట్నంలో వికలాంగుల భవనం ప్రారంభోత్సవం చేయాలి

**యాచారం ,జూన్ 24, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం కేంద్రంలో దివ్యాంగుల నూతన భవనాన్ని ప్రారంభోత్సవం చేయాలని . విహెచ్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం బుధవారం అందజేశారు. దివ్యాంగులకు అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో దివ్యాంగులకు ప్రత్యేకమైన కోటాద్వారా సంక్షేమ పథకాలు కేటాయించాలన్నారు. దివ్యాంగుల పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాల యాదయ్య, ఇబ్రహీంపట్నం మున్సిపల్ మండల శాఖ అధ్యక్షులు ఆకుల సంజీవ, యాచారం మండల శాఖ అధ్యక్షులు దేరంగుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి వినతిపత్రం అందజేస్తున్న విహెచ్ పి ఎస్ నాయకులు



యాచారం మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులు

## ఓటర్ సమగ్ర సవరణ అఖిలపక్షం సమావేశం

**యాచారం,జూన్ 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా యాచారం మండల కేంద్రంలో అఖిలపక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులతో ఓటర్ జాబితా సవరణ తదితర అంశాలను సుదీర్ఘంగా చర్చించారు.అందరికీ ఆమోదయోగ్యంగా పారదర్శకంగా సమగ్ర ఓటర్ సవరణ అవుతుందని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సుభాని,మూడెడ్ల గోవర్ధన్ రెడ్డి, కాజు మహమ్మద్, బొల్లం వెంకటేష్,శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి ఆలయనిర్మాణానికి విరాళం

**కేశంపేట, జూన్ 24 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో స్థానిక పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామ డిప్యూటీ సర్పంచ్ రవి నాయక్ రూ.10,116 విరాళంగా అందజేశారు. గ్రామదేవత అయిన పోచమ్మ తల్లి ఆలయఅభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఆలయ నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ విరాళం ఉపయోగపడుతుందని గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోగుల నర్సింలు, పోగుల యాదయ్య, మలిపెద్ది మల్లయ్య, పోగుల రాములు, పోగుల ధర్మయ్య, దాసరి మల్లయ్య, పోగుల నర్సింలు, ఉడిత్యవత్ శ్రీను గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట..

**దుద్యాల్, జూన్ 24, ప్రభాతవార్త:** విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం దుద్యాల మండలం పరిధిలోని చిల్ముల్ మైలారంలో నూతనంగా నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులను కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బాలప్ప తో కలిసి ప్రారంభించారు. రూ. 40 లక్షల కాడ ప్రత్యేక నిధులతో అదనపు తరగతి గదులను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, నర్సిరెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మి వివిధ గ్రామాల సర్పంచులు పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు..

# భూ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే!

**కొందుర్గు, జూన్ 24, ప్రభాతవార్త :** గత ఎనిమిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యను ఎమ్మెల్యే కే శంకరయ్య, ఆధ్వర్యంలో జిల్లా అదనం కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారిని సరిత, తహసిల్దార్ ఆజం అల్లి లక్ష్మీ ్మ దేవునిపల్లి గ్రామానికి వచ్చి భూ సమస్యను పరిష్కరించినందుకు మండల పరిధిలోని లక్ష్మీ ్మదేవునిపల్లి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వెంకిర్యాల రెవెన్యూ శివారులోని లక్ష్మీ ్మ దేవునిపల్లిలో గ్రామంలో సర్వేనెంబర్లు 75, 77,79,80, 81,90,91 ఈ సర్వే నంబర్లలో మొత్తం విస్తీర్ణం 106.34 గుంటలకుగాను, 2018 సంవత్సరం లో ధరణి వచ్చినప్పుడు 118 ఎకరాల 17 గుంటలు నమోదయింది. దాంతో అప్పటినుంచి ఇప్పటివరకు సమస్యను పరిష్కరించాలని సంబంధిత రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఆయన సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. రెవెన్యూ సదస్సులో భాగంగా గత సంవత్సరం ఆ గ్రామ రైతులు ఆర్.ఎస్.ఆర్. భూమి విస్తీర్ణం ఎక్కువ చూపుతున్నందున భూములు అమ్మినా రిజిస్ట్రేషన్లు కావడం లేదు, బ్యాంకుల్లో పంట రుణాలు రావడంలేదని భూపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమ సమస్యను పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం నాడు ఎమ్మెల్యే శంకరయ్య, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డి, షాద్నగర్ రెవెన్యూ డివిజన్ డివిజనల్ అధికారిని సరిత, స్థానిక తహసిల్దార్ ఆజామల్లీలు రెవెన్యూ సిబ్బందితో కలిసి నేరుగా వ్యవసాయ పొలాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు.



అనంతరం రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరించారు. దాంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు రెవెన్యూ అధికారులకు రుణపడి ఉంటామని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ పసుపుల దామోదర్, గ్రామ పరిపాలన అధికారి రామస్వామి రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,పలువురు నేతలు

**శంషాబాద్ జూన్ 24,ప్రభాతవార్త :** అమ్మవారి కృపతో, ప్రజలందరికి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలు కలగాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అమ్మవారిని వేడుకున్నారు. మంగళవారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి దేవత విగ్రహం మరియు బొడ్రాయి, నాభిశిలా ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అతిథులుగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై శ్రీశ్రీశ్రీ శీతలా బొడ్రాయి, నాభిశిలా, ప్రతిష్టి కార్యక్రమాలను తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశిస్సులతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు గణేష్ గుప్త,మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్,మహేందర్ రెడ్డి,వెంకటేష్ గౌడ్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సమాజాభివృద్ధికి మరో ముందడుగు

**-పోమల్ పల్లిలో కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం**

**కేశంపేట, జూన్ 24, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి, పోమాల్ పల్లి ఇరు గ్రామాల ముదిరాజ్ కుల బంధువుల చిరకాల స్వప్నం సాకారమైంది, సర్వేజనా సుఖినోభవంతు అనే సంకల్పంతో పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో నిర్మించిన ఈ నూతన కమిటీ హాల్‌ను వేద పండితులు మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా కుల బంధువుల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి షాద్ నగర్ నియోజకవర్గం నుండి కేశంపేట్ మండలం నుండి ముదిరాజ్ కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గ ముదిరాజ్ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ముదిరాజ్ మాట్లాడుతూ ఐక్యతకు ప్రతిక ఆత్మగౌరవానికి వేదిక మన ముదిరాజ్ సమాజ నిలయమని వారసత్వపు సంస్కృతిని కాపాడుకుంటూ సమాజానికి వికాసానికి బాటలు వేద్దామన్నారు, తరతరాల చరిత్ర కలిగిన మన ముదిరాజ్ ఆత్మగౌరవం సమిష్టి కృషికి ప్రతిరూపమని ఆయన తెలిపారు, ముదిరాజ్ కమ్యూనిటీ భవనాలను ప్రతి గ్రామంలో నిర్మించుకునే విధంగా కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన తెలిపారు. ముదిరాజ్ సమాజాభివృద్ధికి తన వంతు సహాయ సహకారంగా కమ్యూనిటీ హాల్లో సౌకర్యవంతంగా ఉండేందుకు దాదాపుగా 70 వేల రూపాయల విలువ గల ఆఫీస్ ఫర్నిచర్ టేబుల్లను, కుర్చీలను విరాళంగా అందజేశారు. ముదిరాజ్ జాతి కోసం అహర్నిశలు కృషి చేస్తూ జాతి అభివృద్ధికై పాటుపడుతున్న ముదిరాజ్ జాతిరత్నం పోమల్ పల్లి, కొండారెడ్డిపల్లి సొసైటీ మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఏర్పుల లింగం ముదిరాజును సంఘ సభ్యులు సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఎరుపుల లింగం జాతి కోసం చేసిన సేవలు అమోఘం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు వలికే ఆంజనేయులు ముదిరాజ్ తాలూకా అధ్యక్షులు మంగ వెంకటేష్ ముదిరాజ్, తాలూకా గౌరవ అధ్యక్షులు చెట్ల జంగయ్య ముదిరాజ్, గౌరవ సభ్యులు నల్లమోని బిక్షపతి ముదిరాజ్, యువత ఉపాధ్యక్షులు మంగ అశోక్ ముదిరాజ్ తాలూకా కోశాధికారి కొండే యాదయ్య ముదిరాజ్, తాలూకా మహిళా అధ్యక్షురాలు జూలపల్లి అనసూయ ముదిరాజ్, గౌరవ సలహాదారులు మేకల వెంకటేష్ ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్ కార్యవర్గ సభ్యులు చల్ల భరత్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు రావుల పెంటయ్య ముదిరాజ్, కేశంపేట్ మండల అధ్యక్షుడు శానముని శ్రీశైలం ముదిరాజ్, మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల గోపాల్ ముదిరాజ్, యూత్ మాజీ అధ్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్, కోనాయిపల్లి సర్పంచ్ ధనలక్ష్మి ్మ రామకృష్ణ ముదిరాజ్, కొండారెడ్డిపల్లి పోమాలపల్లి మచ్చకర సొసైటీ ఉపాధ్యక్షుడు భాషలోని కృష్ణయ్య ముదిరాజ్, మాజీ అధ్యక్షుడు పెద్ద లింగం ముదిరాజ్, ఎరుపుల రమేష్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు భావనల, రాములు ముదిరాజ్, బవుండ్ల లింగం ముదిరాజ్, పిట్టల చంద్రయ్య ముదిరాజ్ గుగ్గిల చంద్రయ్య ముదిరాజ్ బాలరాజ్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్ ఆంజనేయులు ముదిరాజ్, శేఖర్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, అంజయ్య ముదిరాజ్ పాపయ్య ముదిరాజ్,యాదయ్య ముదిరాజ్,కృష్ణయ్య ముదిరాజ్ ఇరువు గ్రామాల ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు కెఎస్‌పిటి

# లాల్‌గడిమలక్‌పేట్‌లో డ్రైనేజీ అవుట్‌లెట్ ఏర్పాటుకు చర్యలు

**..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి**

**..ప్రజాప్రతినిధులు, రైతులతో, స్థానికులతో సమీక్షించిన వైనం**

**శామీర్‌పేట, జూన్ 24, ప్రభాతవార్త:** లాల్‌గడిమలక్‌పేట్‌లో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్ ఏర్పాటుకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా, రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండ మున్సిపల్ నుంచి చర్యలు తీసుకోవటం జరుగుతుందని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో ప్రధాన సమస్యగ ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులతో, గ్రామ ప్రజలతో, భూముల యజమానులతో అభిప్రాయాలు తీసుకోవటానికి సమావేశంను నిర్వహించారు. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో శాశ్వతంగా పరిష్కారం చేయటానికి ప్రధాన డ్రైనేజీ అవుట్‌లెట్ ఏర్పాటుకు అవసరమైన భూమి లభ్యత, ప్రతిపాదిత మార్గం, సాంకేతిక అంశాలు, భవిషత్‌లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమీక్షించి చర్చించారు. దీనిలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్‌పర్సన్ కె.మాలతిమాదవరెడ్డి, కౌన్సిలర్లు కైర గణేశ్,మౌనిక, వనజ, స్వప్న, కమిషనర్ వెంకట్‌రెడ్డిలు పాల్గొని సంబంధిత రైతులు, భూ యజమానులు, గ్రామస్థులతో చర్చించారు. గ్రామంలో వర్షాకాల సమయంలో వర్షపు,, మురుగునీరు సక్రమంగ వెళ్లకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డ్రైనేజీ అవుట్‌లెట్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని దీనిలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి గ్రామంలో నీటి నిల్వ మురికినీరు సమస్యలు శాశ్వతంగ పరిష్కరించటానికి పురపాలక సంఘం కట్టుబడి ఉందని, ప్రజల అందరి సహకారంతో త్వరగా కార్యచరణ ప్రణాళిక రూపొందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. వైస్‌చైర్‌పర్సన్ కె.మాలతిమాదవరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇస్తామని, అందరి సహకారంతో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చటానికి కృషి చేస్తామన్నారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యను పరిష్కరించటానికి సాంకేతిక నివేధికలు సిద్ధం చేసి అవసరమైన పరిపాలనా అనుమతులు పొందిన తరువాత పనులను ప్రారంభించటానికి ఆ దిశగా చర్యతీసుకుంటామని, రైతుల, గ్రామస్థుల అందరి సహకారం దీని కోసం ఉండాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్ ఏర్పాటుకు గ్రామస్థులతో చర్చించిని మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక ప్రజల దృశ్యం

# పిహెచ్‌డి సీటు సాధించిన విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తా

**-ఉత్తమ ప్రతిభకు పట్టం కట్టిన విద్యాసంస్థల చైర్మన్ రఘుపతి**

**-జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ రఘుపతి**

**కేశంపేట ,జూన్ 24 ,ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన మాల యాదయ్య కుమార్తె అనూష బయోటెక్నాలజీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి తిరుపతిలో పిహెచ్‌డి సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను విద్యార్థిని తల్లిదండ్రుల గ్రామస్తుల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించేందుకు జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ దిద్దెల రఘుపతి ముందుకొచ్చారు. విద్యార్థిని పరిశోధనను మరింత సులభతరం చేయడానికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అత్యున్నత విద్యలో ప్రవేశం సాధించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు దిద్దెల రఘుపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల ప్రకాష్ గౌడ్, బాలాజీ, నిర్మల్, పురుషోత్తం, కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న గ్రామస్తులు

## న్యాలట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

**విద్యార్థులకు అండగా వరంగల్ రాజమోళి కుటుంబ సభ్యులు**

**చేవెళ్ల, జూన్ 24, ప్రభాతవార్త :** చేవెళ్ల మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా తాండూరుకు చెందిన వరంగల్ రాజమోళి కుటుంబ సభ్యులు తమ సేవా భావాన్ని చాటుతూ పాఠశాలలోని విద్యార్థులకు నూతన స్కూల్ బ్యాగులను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. చిన్నారులు ఆనందోత్సాహాల మధ్య బ్యాగులను స్వీకరించగా, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు దాతల సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుపై ఆసక్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న దాతలు, సేవా దృక్పథం కలిగిన కుటుంబాలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని, గ్రామ పెద్దలు మరియు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ రాజమోళి కుటుంబ సభ్యులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుచ్చయ్య, ఉప సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ లక్ష్మీ ్మ సత్యనారాయణ, స్కూల్ హెడ్మాస్టర్ హసీనబేగం, టీచర్స్ రాజశేఖర్, హరిశెంకర్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## ఎల్గొండగూడ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలి



డీఈవో వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మల్లేశంగౌడ్

**షాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :** యెల్గొండగూడ పాఠశాలను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. షాబాద్ మండలం ఎల్గొండగూడ పాఠశాలకు జాతీయ స్థాయి పురస్కారం రావడంతో ఎల్గొండగూడ ప్రధానోపాధ్యాయుడు మల్లేశంగౌడ్ బుధవారం కలెక్టరెట్లో డీఈవో వెంకటేశ్వర్లు, సిఎంవో వెంకటేశంను కలిసి ఘనంగా సన్మానించాడు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... పాఠశాలకు జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పాఠశాల అభివృద్ధికి సహకరించిన అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. పరిశుభ్రత, పచ్చదనం. విద్యాప్రామాణల పెంపుదలలో భాగంగా అందరూ సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు పరిశుభ్రమైన, పర్యావరణ హిత వాతావరణాన్ని అందిం చేందుకు కృషి చేయాలని సూచించారు.



## సీతారాంపూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం

**- నోటుబుక్స్ పంపిణీ**

**షాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలోని సీతారాంపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ తోపుగొండ పావని చెన్నయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ముద్దంగుల ఆంజనేయులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో అక్షరాభ్యాసం ఒక ముఖ్యమైన ఘట్టమని, చిన్నప్పటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం సమాజ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బుగ్గ రాములు, వార్డు సభ్యులు చన్వెళ్లి విజయలక్ష్మీ ్మరెడ్డి, బి. సత్తయ్య, గ్రామ కార్యదర్శి ప్రమీల, ఉపాధ్యాయులు పార్వతి, శ్రీశైలం, గ్రామ పెద్దలు ఏకాంబర్ రెడ్డి, రాజు, మణి చించెట్టి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం..చీరెల పంపిణీ

**ఘట్‌కేసర్, జూన్ 24, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘనాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు, ఇందిరా మహిళా శక్తి చీరెలను పంపిణీ చేశారు. ఘణాపూర్‌లో ఇందిరమ్మ పథకం కింద వేముల సుధాకర్, చిలుగూరి వెంకటేశ్‌లు రూ.5 లక్షల ప్రభుత్వ నిధులతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోగా మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ విచ్చేసి రిబ్బన్ కత్తిరించి కొబ్బరికాయలు కొట్టి ఇళ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్దిదారులు విచ్చేసిన నాయకులకు మిఠాయి తినిపించి శాలువాతో సన్మానించారు. అంతకుమందు లింగాపూర్ కమ్యూనిటీహాలులో ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక గ్రూపుల సభ్యులకు ఆయన చీరెలను పంపిణీ చేశారు.

## 28న శంషాబాద్‌కి బిజెపి జాతీయ అధ్యక్షుడు రాక

**-బిజెపి కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్ననున్న నితిన్ నబిన్**

**శంషాబాద్ జూన్ 24,ప్రభాతవార్త :** రాష్ట్రానికి బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈనెల 28న రానున్నారని కావున పెద్దఎత్తున బిజెపి నేతలు ఆయన స్వాగతం పలకాలని బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి పేర్కొన్నారు. శంషాబాద్‌లో బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పర్యటన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్ర శేఖర్ తివారి హాజరై మాట్లాడారు.... ఈనెల 28న శంషాబాద్‌లో బీజేపీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రానున్నారని ఈకార్యక్రమానికి బిజెపి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కార్యాలయంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తా రన్నారు. కావున ముఖ్య నాయకులు, ప్రతి బూత్ అధ్యక్షుడు, తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం పార్టీ సంస్థాగత బలోపేతానికి ఒక మైలురాయిగా నిలుస్తుందని, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పర్యటనతో జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల్లో మరింత ఉత్సాహం, నూతన స్ఫూర్తి నెలకొంటుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు , మాజీ జిల్లా అధ్యక్షులు, జిల్లా బీజేపీ పదదికారులు వివిధ మోర్చాల అధ్యక్షులు పదదికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సంతకాల సేకరణ

**జిల్లెడు చౌదరి గూడెం, జూన్ 24, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోనే నూతన పోలీస్ స్టేషన్ ను నిర్మించాలని కోరుతూ జేఏసీ నాయకులు బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో ని లాల్ పాడులో పోలీస్ స్టేషన్ నిర్మించడం వలన మండల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నిర్మించాలని కోరారు. సంతకాలు చేసిన ప్రజలను ముఖ్యమంత్రి కార్యాలయం తో పాటు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, చీఫ్ సెక్రటరీ, కమిషనర్ ఆఫ్ పోలీస్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్, తాసిల్దార్ కార్యాలయం లకు పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ సుధాకర్ రావు, సయ్యద్ ఆఫీజ్, కోనేరు శ్రీనివాస్, కొండి యాదయ్య, మానయ్య, మహేందర్, సత్తయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





కొడంగల్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంబిస్తున్న మున్సిపల్ చైర్మేన్

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

**క్షమున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్**

**కొడంగల్,జూన్ 23,(ప్రభాతవార్త):** పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని 2వ వార్డు తెలంగ్‌వాడీలో కుర్మయ్య నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, అందులో బాగంగా ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తున్నదని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ జరిగిందని, బీఆర్ఎస్ 10 ఏళ్ళ పాలనలో ఒక్క ఇల్లు కూడా మంజూరీ చేయలేకపోయిందదని విమర్శించారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల అనిత, కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, కొడంగల్ నయ్యూం తదితరులు పాల్గొన్నారు.



## రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల పంపిణీ

**....బుధవారం మండలంలోని రైతు వేదికలలో విత్తన మేళా**

**మోమిన్‌పేట్, జూన్ 24, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకొరకు నాణ్యమైన విత్తనాలు రైతువేదికల ద్వారా పంపిణి చేయడం రైతులకు మంచి సువర్ణావకాశమని ఆయా గ్రామాల సర్పంచులు పేర్కొన్నారు. బుధవారం వెల్‌చాల్ రైతు వేదికలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన, వ్యవసాయ విస్తరణ అధికారిణి స్వాతి ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణి చేశారు. ఈ సంధర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం రైతులకొరకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు పంపిణి చేయడం రైతుల అదృష్టం అని తెలిపారు. రైతులకు వరి విత్తనాలు సబ్సిడీపై పొందవచ్చని, మరియు అన్ని రకాల విత్తనాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కనుకా మండలంలోని రైతులు సంభందిత క్లస్టర్ రైతువేదికలు మోమిన్‌పేట, వెల్‌చాల్, మేకవనంపల్లి, టేకులపల్లి, కేసారం రైతువేదికలలో నేడు విత్తన మేళా ప్రారంభించినట్లు ఏఈఓ స్వాతి తెలిపారు. వెల్చాల్ క్లస్టర్ రైతువేదిక పరిధిలోని దుర్గంచెర్వు, మొరంగపల్లి, వెల్చాల్, మల్లారెడ్డిగూడెం, రాంనాథ్‌గుడుపల్లి గ్రామాల రైతులు అవసరమైన విత్తనాలు పొందవచ్చని ఏఈఓ స్వాతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు నర్సింలు రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక సర్వ సభ్య సమావేశం

**చేవెళ్ల, జూన్ 24, ప్రభాతవార్త :** చేవెళ్ల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ధారాలక్ష్మి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వార్షిక సర్వ సభ్య సమావేశం జరిగింది. ఇట్టి సమావేశానికి అడిషనల్ జోజప్ప హాజరు అయ్యారు. మహిళా రైతులకు మార్కెటింగ్ మరియు ఉత్పత్తులు ఏ విదంగా చేసుకోవాలో వివరించారు .రైతు పండించిన పంటను కొనుగోలు చేయడం గురించి వివరించారు. ఈరోజు మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన పాలక వర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది చైర్మెన్ సుమలత. వైస్ చైర్మన్‌గా శోభను ఎన్నుకు న్నారు. పాత పాలకవర్గం సభ్యులకు సన్మానించడం జరిగింది ఇట్టి సమావేశంలో డీపీఎం నరసింహులు ఏపీఎం రవీందర్ మరియు శ్రీనివాస్ శ్రీనిధి ఆర్ఎం అనిల్ కుమార్ సార్ మండల సమాఖ్య అధ్యక్షురాలు భారతి కార్యదర్శి జ్యోతి కోశాధికారి సుమిత్ర సీసీలు ప్రభాకర్ షబ్బీర్ సాగర్ నరసింహులు యాదయ్య మాణయ్య అకౌంటెంట్ అరుణ 32 సంఘాల నుంచి హాజరైన మహిళ రైతులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం 2కె రన్

**దుద్యాల్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత**

**దుద్యాల్, జూన్ 24 (ప్రభావవార్త):** మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా యువతలో అవగాహన కల్పించేందుకు దుద్యాల్ ఎస్సై శ్రీశైలం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దుద్యాల్ గేట్ నుండి హస్నాబాద్ వరకు నిర్వహించిన ఖ2కె రన్‌ఖిలో పెద్ద సంఖ్యలో యువకులు, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎస్సై శ్రీశైలం మాట్లాడుతూ, నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మాదకద్రవ్యాల వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నం కావడమే కాకుండా, యువత బంగారు భవిష్యత్తు నాశనమవుతుంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి అని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, ఎస్టీ సెల్ మండల ప్రెసిడెంట్ రవి నాయక్, మాజీ ఎంపీటీసీ ఎల్లప్ప, నాయకులు రామాంజనేయులు, మ్యాకం శ్రీనివాస్, మల్లికార్జున్, స్థానిక యువకులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

